సాక్షి
ఖమ్మం

బుధవారం ၊ 16 ၊ అక్టోబర్ ၊ 2024



**ఆయకట్టు అంతటికీ నీరు**

సాగర్ కాల్వల ద్వారా చివరి ఆయకట్టుకూ నీరు అందేలా చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను అధికారులు సిబ్బందితో తీయిస్తున్నారు. 10లో



**బకాయిలు విడుదల చేయాలి**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు కోరారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

**వాతావరణం**

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఎండ పెరిగే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### నేడు మంత్రి పొంగులేటి పర్యటన

**ఖమ్మం రూరల్/నేలకొండపల్లి:** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు ఖమ్మం 60వ డివిజన్‌లోని రామన్నపేట ఎస్సీ కాలనీలో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత నేలకొండపల్లి మండల కేంద్రంలోని భక్త రామదాసు ఆడిటోరియంలో సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులతో పాటు గౌడ కులస్తులకు కాటమయ్య రక్షణ కిట్లు, పీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తారు. అనంతరం 11గంటలకు కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో ఖమ్మం రూరల్ మండలంలోని ముఖ్య నాయకులతో మంత్రి పొంగులేటి సమావేశమవుతారు.

### బాణసంచా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలి

**ఖమ్మంక్రైం:** రానున్న దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేయాలనుకునే వ్యాపారులు ఈనెల 25వ తేదీలోగా సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. అనుమతి తీసుకున్నవారు పోలీస్, నగరపాలక సంస్థ, అగ్నిమాపక శాఖలు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే దుకాణాలు ఏర్పాటుచేయాల్సి ఉంటుందని తెలిపారు. సెల్ఫ్ అఫిడవిట్, చలానా రశీదు, ఆధార్ కార్డ్, ఫొటోలను దరఖాస్తుకు జత చేయాలని పేర్కొన్నారు. కాగా, అనుమతి లేకుండా బాణసంచా తయారుచేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ ఓ ప్రకటనలో హెచ్చరించారు.

### శిక్షణను పరిశీలించిన జెడ్పీ సీఈఓ



శిక్షణ వివరాలు తెలుసుకుంటున్న సీఈఓ

**తిరుమలాయపాలెం:** మండలంలోని తిరుమలాయపాలెం రైతు వేదికలో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యాన గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ మేరకు శిక్షణ శిబిరాన్ని జెడ్పీ సీఈఓ దీక్షారైనా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయడమే కాక పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని తెలిపారు. ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

### జలవనరుల శాఖ ఎస్‌ఈగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

**ఖమ్మంఅర్బన్:** జలవనరులశాఖ ఖమ్మం సర్కిల్ ఇంజనీర్(ఎస్‌ఈ)గా పాలేరు ఈఈ మంగళపుడి వెంకటేశ్వర్లుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు చీఫ్ ఇంజనీర్(అడ్మిన్) అనిల్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎస్‌ఈగా ఉన్న నర్సింగరావు ఈనెల 26వ తేదీ వరకు సెలవులో వెళ్లారు. ఈనేపథ్యాన వెంకటేశ్వర్లుకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో బుధవారం ఆయన ఎస్‌ఈగా విధుల్లో చేరనున్నారు.

### పకడ్బందీగా పారిశుద్ధ్య నిర్వహణ



మాట్లాడుతున్న డీపీఓ ఆశాలత

**ఖమ్మంవన్‌టౌన్:** గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ పరిశుభ్రమైన పల్లెలుగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. సింగరేణి, కామేపల్లి, వైరా, కొణిజర్ల, రఘునాథపాలెం మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలతో ఖమ్మంలో ఆమె పలు అంశాలపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి నేపథ్యాన పనులు చేడుతూనే ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇదేసమయాన పెండింగ్ ఉన్న ఇంటి పన్నుల బకాయిలు వసూలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎల్‌పీఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# అండగా నిలుస్తున్నదెవరు?!

**జిల్లాలో జోరుగా ఇసుక, మట్టి, రేషన్ బియ్యం దందా**

- అధికారుల పట్టింపులేని తనంపై అనుమానాలు
- ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఉద్యోగులపై వేటు
- ఇక్కడ కూడా రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖలపై నిఘా

**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** జిల్లాలో అక్రమ దందాలకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. అక్రమార్కులకు వివిధ శాఖల అధికారులు అండగా నిలుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి కార్యకలాపాలకు వత్తాసు పలుకుతున్న రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కొందరు సీఐలు, ఎస్సైలపై ఉన్నతాధికారులు ఇటీవల చర్యలు తీసుకున్నారు. అయితే వీరే కాక రెవెన్యూ, మైనింగ్ తదితర శాఖల అధికారులు సైతం భాగస్వాములుగా ఉన్నారనే చర్చ జరుగుతోంది. జిల్లాలో ఇసుక, మట్టి, రేషన్‌బియ్యం దందాకు తోడు పేకాట పందేల నిర్వహణ యథేచ్ఛగా కొనసాగుతోంది. వీటిని నిర్మూలించాల్సిన రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖలు పట్టనట్లుగా వ్యవహరిస్తుండడానికి కారణాలపై ప్రభుత్వం నిఘా వేసి బాధ్యుల వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

**సరిహద్దుల్లో జిల్లా**

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏపీతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు కూడలిగా ఉంది. దీంతో జిల్లా మీదుగా ఆయా రాష్ట్రాలకే కాక హైదరాబాద్, ముంబై, విశాఖపట్నం వంటి నగరాలకు గంజాయి, రేషన్ బియ్యం తరలిస్తున్నారు. అప్పుడప్పుడు కొందరు పట్టుబడుతున్నా తరలుతున్న గంజాయి అధిక మొత్తంలోనే ఉంటోందని సమాచారం. గతంలో రైళ్లకే పరిమితమైన అక్రమ రవాణాదారులు బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలను ఎంచుకుంటున్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా, తనిఖీలు ముమ్మరం చేసినా గంజాయి రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. మరోవైపు రేషన్ బియ్యం కూడా జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలు, దేశాలకు తరలుతున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో గంజాయి, రేషన్ బియ్యం తరలించే వారికి ఎవరైనా అధికారులు సహకరిస్తున్నారా.. ఎవరెవరి అండ ఉందనే అంశంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు.

**అండ ఉంటే చాలు..**

జిల్లాలో ఇసుక రీచ్‌లు లేకపోయినా, మట్టి తవ్వకానికి కేవలం మూడు చోట్లే అనుమతులు ఉన్నా.. రవాణా మాత్రం మూడుపూలు ఆరుకాయలుగా సాగుతోంది. బహిరంగంగానే లారీలు, ట్రాక్టర్లలో మట్టి, ఇసుకను తరలిస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఎప్పుడైనా ఆరోపణలు వస్తే ఒకటి, రెండుచోట్ల వాహనాలను సీజ్ చేయడం, ఆ తర్వాత వదిలేయడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం, ఇళ్ల నిర్మాణాల దృష్ట్యా ఇసుక, మట్టికి భారీగా డిమాండ్ ఉండడంతో దందా అదే స్థాయిలో కొనసాగుతోంది. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో అక్రమార్కుల పని మరింత సులువైందన్న ఆరోపణలున్నాయి.

**జిల్లాలోనూ నిఘా**

జిల్లాలో గతంలో పేకాట ఆడుతున్న పలువురు వ్యక్తులకు కొందరు పోలీసులు సహకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. వీరిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇలాంటి అక్రమాలు, అవినీతి చర్యలకు అండగా నిలుస్తున్న అధికారులపై ఉదాసీనంగా వ్యవహరించేది లేదనే సంకేతాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించిన ట్లు తెలిసింది. ఇక జిల్లాలోనూ పోలీస్ శాఖతోపాటు అన్ని శాఖల్లో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అక్రమార్కులకు అండగాఉండే వారిపై నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలో ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో తేలాల్సి ఉంది.

**ఆ శాఖపైనే నజర్..**

పలు శాఖల అధికారులతోపాటు అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీసుల అలసత్వంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇవే ఆరోపణలపై రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల పలువురు సీఐలు, ఎస్సైలు సస్పెన్షన్‌కు గురయ్యారు. ప్రధానంగా ఇసుక అక్రమ రవాణాకు అండగా నిలవడంతోపాటు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, గ్యాంబ్లింగ్, మట్కాలకు సహకరించడం వంటి ఆరోపణలు ఎదుర్కొన్న వారిపై వేటు పడింది. ఇక రేషన్ బియ్యం తరలింపులోనూ పోలీసుల సహకారం ఉందనే ఆరోపణలతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్నతాధికారులు నిఘా వేశారు. దీంతో ఈ శాఖకు సంబంధించి జిల్లాలో పరిస్థితి ఏమిటన్నది ఆరా తీస్తున్నట్లు సమాచారం.

## నమస్కారం నేను కలెక్టర్‌ను..

- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి
- షాపుల యజమానులు, ఆటోడ్రైవర్లతో మాట్లాడిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఫుట్‌వేర్ షాపు యజమానితో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

**ఖమ్మంసహకారనగర్:** 'నమస్కారం బాగున్నారా, నేను కలెక్టర్‌ను.. వ్యాపారం ఎలా నడుస్తోంది..' అంటూ చిరువ్యాపారులు, ఆటోడ్రైవర్లతో మాట్లాడిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వివరాలు తెలుసుకున్నారు. ఖమ్మం బస్టాండ్‌కు ఆనుకుని షాదీఖానా వెళ్లే రోడ్డులో ఉన్న ఫుట్‌వేర్ షాప్‌లోకి మంగళవారం ఉదయం ఆకస్మాత్తుగా వెళ్లిన కలెక్టర్ రోజువారీ సంపాదన, కుటుంబ పోషణ, పిల్లల చదువు వివరాలను యజమాని సయ్యద్ బిలాల్ పాషాను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ముద్ర తదితర పథకాల ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**పాఠశాలలకు వెళ్లండి**

బస్టాండ్ సిగ్నల్ వద్ద ఆటోస్టాండ్‌కు వెళ్లిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అక్కడి డ్రైవర్లతో మాట్లాడి ఆటో సొంతమా, అద్దెకు తీసుకున్నారా, రోజు ఎంత ఆదాయం వస్తుందని ఆరా తీశారు. అలాగే, పిల్లలు చదువుతున్న పాఠశాలల్లో జరిగే సమావేశాలకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు ఉంటే చెప్పాలని సూచించారు. అంతేకాక జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో వైద్యంపైనా ఆరా తీశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తనను కలవాలని సూచించారు. ఈమేరకు కలెక్టర్ నేరుగా తమ వద్దకు రావడం ఆనందంగా ఉందని చెప్పిన డ్రైవర్ ప్రసాద్, తదితరులు బీమా సౌకర్యం కల్పించి ఆటో అడ్డాలు పెంచాలని కోరారు. దీంతో కలెక్టర్ బదులిస్తూ ఆటో డ్రైవర్లు ఏటా కొంత మొత్తం చెల్లిస్తే బీమా అమలుకు ప్రణాళిక రూపొందిస్తామని, దీనిపై త్వరలోనే చర్చిస్తామని తెలిపారు.


### దళితబంధు యూనిట్లపై పర్యవేక్షణ

లబ్ధిదారులు దళితబంధు యూనిట్ల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. చింతకాని మండలంలో యూనిట్లను ప్రతీ 15 రోజులకోసారి పరిశీలించాలని చెప్పారు. మొదటి విడతలో పశుసంవర్ధక శాఖకు సంబంధించి 492, వ్యవసాయ శాఖకు సంబంధించి 223, వాహనాలు 430, ఇతర యూనిట్లు 242 ఎక్కడ ఉన్నాయో ఆరా తీయాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ నవీన్‌బాబు, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ వేణుమనోహర్, డీఏఓ పుల్లయ్య, ఆర్‌టీఓ వెంకటరమణ, చింతకాని ఎంపీడీఓ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

**భద్రాచలం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి ఉపాలయంలో ఆంజనేయస్వామికి అభిషేకం, తమలపాకులతో అర్చన గావించారు.

## గ్రామీణ రోడ్లకు మహర్దశ



- జిల్లాకు రూ.105 కోట్ల నిధులు
- ఖమ్మం, పాలేరు, మధిరకు రూ.25 కోట్లు చొప్పున..
- వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు రూ.15 కోట్ల చొప్పున కేటాయింపు

**ఖమ్మంవన్‌టౌన్:** గ్రామీణ ప్రాంత రహదారుల రూపురేఖలు మారనున్నాయి. వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలోని 92 నియోజకవర్గాల్లో గ్రామీణ రహదారుల నిర్మాణానికి రూ.1,377కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లాకు రూ.105 కోట్లను కేటాయించారు. ఇందులో ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాలకు రూ.25కోట్ల చొప్పున, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాలకు రూ.15కోట్ల చొప్పున కేటాయిస్తూ పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు.

**నియోజకవర్గాల వారీగా ఇలా...**

జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు భారీగా నిధులు విడుదలయ్యాయి. ఖమ్మం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతం కలిగిన రఘునాథపాలెం మండలంలో 11చోట్ల 24.15 కి.మీ. రోడ్ల నిర్మాణంతో పాటు ఒక బ్రిడ్జి నిర్మాణానికి రూ.25కోట్లు కేటాయించారు. మధిర నియోజకవర్గంలో ఆరు చోట్ల 15.80 కి.మీ. బీటీ రోడ్ల నిర్మాణం, పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో 12చోట్ల 22.88 కి.మీ. రహదారుల నిర్మాణానికి రూ.25కోట్ల చొప్పున విడుదల చేశారు. ఇక వైరా నియోజకవర్గంలో సింగరేణి, కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు మండలాల్లో ఐదు చోట్ల 14.64 కి.మీ. బీటీ రోడ్ల నిర్మాణం, సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లో ఎనిమిది చోట్ల 14.50 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి రూ.15కోట్ల చొప్పున కేటాయించినట్లు పంచాయతీ రాజ్ ఎస్‌ఈ రామానుజస్వామి, ఈఈ వెంకటరెడ్డి తెలిపారు. మొత్తంగా 91.97 కి.మీ. మేర గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.105 కోట్లు మంజూరు చేయడంతో ఆయా రహదారులకు మహర్దశ పట్టనుంది.

## జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- 63 మసీదుల మరమ్మతులకు రూ.లక్ష చొప్పున చెక్కుల పంపిణీ



షాదీఖానాలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన అధికారులు, ప్రజాప్రతినిధులు



బల్లేపల్లి చెరువులో చేపపిల్లలు వదులుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మంవన్‌టౌన్:** జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం షాదీఖానాలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఖమ్మం నియోజకవర్గంలోని 63మసీదుల మరమ్మతులకు రూ.లక్ష చొప్పున చెక్కులను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి మంత్రి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యతో అభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తించి అందరూ పిల్లలను చదివించాలని సూచించారు. ఇక్కడ కష్టపడే కలెక్టర్ ఉన్నందున ఏ సమస్య వచ్చినా ఆయన దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. షాదీఖానా నిర్మాణానికి అనువైన స్థలాన్ని అందరూ కలిసి గుర్తించాలని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం నలుదిక్కులా ఖబరస్తాన్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించిన నేపథ్యాన నాలుగు స్థలాలను గుర్తించామని తెలిపారు.

**మున్నేటి వరద ముంచెత్తకుండా...**

ఖమ్మం 46వ డివిజన్ సారధినగర్‌లో స్ట్రోమ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణానికి మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్నేటి వరద ముంచెత్తకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణం డిజైన్ ఖరారు కోసం నిపుణుల కమిటీని నియమించాలని సీఎంను కోరానని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఉంటున్న పేదలకు మరోచోట స్థలాలు ఇచ్చాకే ఆక్రమణలు తొలగించాలని, ఈ విషయంలో కార్పొరేటర్లు చర్చించాలని తెలిపారు. ఈసమావేశాల్లో మేయర్ పి.నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సత్యనారాయణ, కార్పొరేటర్లు కమర్తపు మురళి, కన్నం వైష్ణవి, నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, ప్రసన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**మత్స్యకారుల అభివృద్ధికి కృషి**

**ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం:** మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగా వంద శాతం సబ్సిడీపై చేపపిల్లలు సరఫరా చేస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం బాలపేటలోని బల్లేపల్లి చెరువులో చేపపిల్లలు వదిలాక ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 310 చెరువుల్లో 60లక్షల చేప పిల్లలను ఉచితంగా వదలనున్నట్లు తెలిపారు. మెడికల్ కాలేజీ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామన్నారు. బల్లేపల్లి, బాలపేట ప్రాంతంలో అన్ని ఇళ్లకు నంబర్లు కేటాయంచాలని, చెరువులు ఆక్రమణకు గురి కాకుండా హద్దులు నిర్ధారించాలని అధికారులకు సూచించారు. ఆతర్వాత రఘునాథపాలెం మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా రాంక్యాతండాలో జరిగిన సభలో మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకొస్తే మంచి లాభాలు ఉంటాయని తెలిపారు. ఇదే సమావేశంలో కల్లుగీత కార్మికులకు కాటమయ్య భద్రత కిట్లు పంపిణీ చేశారు. ఈసమావేశాల్లో మేయర్ నీరజ, కార్పొరేటర్లు మలీదు జగన్, లకావత్ సైదులు, ఫిషరీస్ ఏడీ శివప్రసాద్, తహసీల్దార్లు రవికుమార్, విల్సన్, వివిధ శాఖల అధికారులు అనన్య, యుగంధర్, ఉదయ్‌ప్రతాప్, అశోక్, మహేష్‌బాబు, చిరంజీవి, తిరుపతమ్మ, కొంగర వెంకటేశ్వర్లు, నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మానుకొండ రాధాకిషోర్, ఎం.వెంకటేశ్వర్లు, గొడుగు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, చోటాబాబా, తాతా రఘురాం, రావూరి సైదబాబు, బోడా శ్రావణ్, చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ క్రీడాకారులను అందిస్తాం

- శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి
- జిల్లా కేంద్రంలో క్రీడాజ్యోతితో ర్యాలీ
- పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, క్రీడాకారులు



క్రీడా జ్యోతితో ర్యాలీలో శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు

**ఖమ్మం స్పోర్ట్స్:** రాష్ట్ర క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(శాట్స్) చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. సీఎం కప్ పోటీల ప్రచారంలో భాగంగా క్రీడా జ్యోతితో చేపట్టిన ర్యాలీ(టార్చ్ రిలే) మంగళవారం జిల్లాకు చేరుకుంది. ఈసందర్భంగా సర్దార్ పటేల్ స్టేడియంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చి శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. క్రీడాభివృద్ధికి ఎన్ని నిధులైనా కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా క్రీడాకారులు వివిధ రంగాల్లో సత్తా చాటుతున్నారని.. వీరికి మరింత సానబెడితే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అకాడమీల ద్వారా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. క్రీడా సంఘాల ప్రతినిధులు కృస్టోఫర్ బాబు, రఘునందన్, బి.గోవిందరెడ్డి, ఉప్పల్‌రెడ్డి, సాంబమూర్తి, ఆదర్శ్ కుమార్, ఎం.డీ.మతిన్, కోచ్‌లు ఎండీ.గౌస్, ఎం. డీ.అక్బర్ అలీ, పరిపూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

**ట్యాంక్‌బండ్ వరకు ర్యాలీ**

భద్రాద్రి జిల్లా మీదుగా జిల్లాలోకి ర్యాలీ ప్రవేశించగా పటేల్ స్టేడియంలో సభ నిర్వహించారు. ఆతర్వాత ర్యాలీని శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి ప్రారంభించగా ఇల్లెందు క్రాస్ రోడ్డు, కోర్టు, ఇందిరానగర్ రోడ్డు, మమత ఆస్పత్రి రోడ్డు మీదుగా లకారం ట్యాంక్ బండ్ వరకు చేరింది. ఈర్యాలీలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో పాటు క్రీడాకారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక ర్యాలీ సందర్భంగా యువత ఆటపాటలు ఆకట్టుకున్నాయి.

## నిరాశ పడేలోపే మొదలు..!



కౌన్సెలింగ్ నిర్వహించిన ఖమ్మం డైట్ కళాశాల ఆవరణలో వేచి ఉన్న అభ్యర్థులు

**డీఎస్సీ – 2024లో** ఉపాధ్యాయులుగా ఎంపికై ఇటీవల నియామకపత్రాలు అందుకున్న వారికి ఖమ్మం టేకులపల్లిలోని డైట్ కళాశాలలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే, అభ్యర్థులు ఉదయమే చేరుకోగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన అధికారులు.. మధ్యాహ్నం తర్వాత మళ్లీ సమాచారం ఇచ్చి మొదలుపెట్టారు. డీఎస్సీ ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ఎంచుకున్న ప్రాంతాల్లో పోస్టింగ్ కేటాయించి అక్కడికక్కడే ఉత్తర్వులు అందజేశారు. డీఈఓ సోమశేఖరశర్మ నేతృత్వాన మధ్యాహ్నం మొదలైన ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది. పోస్టింగ్ ఆర్డర్లు అందుకున్న నూతన ఉపాధ్యాయులు బుధవారం ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు. 10లో

## క్లుప్తంగా

### సహకార ఉద్యోగుల కమిటీ ఎన్నిక



కార్యవర్గం ఎన్నికపై చర్చిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా సహకార శాఖ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఖమ్మంలోని సహకార శాఖ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించగా ఏడుగురు డైరెక్టర్లు ఏకగ్రీవమయ్యారు. ఇందులో నుంచి అధ్యక్షుడిగా ఎన్.సుబ్బారావు(అసిస్టెంట్ రిజిస్ట్రార్), ఉపాధ్యక్షుడిగా టి.ఆనంద్ బాబు(సీనియర్ ఇన్‌స్పెక్టర్), కార్యదర్శిగా ఈ.స్వప్న, డైరెక్టర్లుగా సీహెచ్.మైకుమారి, జి.ఉష, డి.వెంకటరమణ, పి.రామకృష్ణను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సీనియర్ ఇన్‌స్పెక్టర్ బి.రవికుమార్ వ్యవహరించారు.

### సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడులు



పత్తి పంటను పరిశీలించుతున్న డీఏఓ, ఏఓ

రఘునాథపాలెం: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులతో పాటు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి సాధించొచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య తెలిపారు. మండలంలోని కొర్లబోడు తండాలో పోడు భూముల్లో సాగవుతున్న పంటల వివరాలను మంగళవారం నమోదు చేశారు. ఈకార్యక్రమాన్ని పరిశీలించిన డీఏఓ రైతులకు సూచనలు చేశారు. మిర్చి, పత్తి, వరి పైర్లలో ఆశిస్తున్న తెగుళ్లు, నివారణ చర్యలను వివరించారు. ఈకార్యక్రమంలో ఏఓ ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వరి పంటపై కలుపుమందు పిచికారీ



ఎండిపోయిన పొలంలో రైతు

కారేపల్లి: చేతికి వచ్చిన వరి పంటపై గుర్తుతెలియని వ్యక్తులు కలుపుమందు పిచికారీ చేయడంతో పంట పాడైందని రైతు వాపోయాడు. మండలంలోని గేటుకారేపల్లికి చెందిన సాయినేని బసవయ్య ఎకరం భూమిలో వరి సాగు చేశాడు. ఈ పంటపై గుర్తుతెలియని వ్యక్తులు కలుపు మందు పిచికారీ చేయగా ఎండిపోయింది. ఈమేరకు రూ.40వేల మేర నష్టం ఎదురైందని ఆయన మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు.

### కొత్తలింగాల ఆలయ హుండీ ఆదాయం రూ.35వేలు

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాలలో శ్రీ కోటమైసమ్మతల్లి ఆలయం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. ఈఓ నల్లమోతు శేషయ్య, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యాన హుండీ లెక్కించగా రూ.35వేల ఆదాయం నమోదైంది. తొలుత ఆలయ ప్రాంగణంలోని షాపులకు వేలం నిర్వహించగా ఎవరూ పాల్గొనకపోవడంతో వాయిదా వేశారు.

### కోణార్క్‌లో 10కేజీల గంజాయి స్వాధీనం




స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

మధిర: కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో తరలిస్తున్న పది కేజీల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి ఆధ్వర్యాన మంగళవారం తనిఖీలు చేపట్టగా గంజాయి లభ్యమైంది. అయితే, గంజాయి తరలిస్తున్న నిందితులెవరో తెలియరాలేదని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

### వీధికుక్కల దాడిలో మూగజీవాలు బలి

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురంలో మంగళవారం వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. గ్రామానికి చెందిన గుండెల వెంకటేశ్వర్లుయాదవ్ షెడ్డులో జీవాలను కట్టేయగా కుక్కలు దాడి చేయడంతో మూడు గొర్రెలు, రెండు మేకలు మృతి చెందాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కుక్కలు గ్రామంలో దాడులకు పాల్పడుతుండడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. కాగా, రూ.లక్ష మేర ఆస్తి నష్టం జరిగినందున తనను ఆదుకోవాలని వెంకటేశ్వర్లు కోరుతున్నాడు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.17,043 |

# నిరాశ పడేలోపే మొదలు !



కౌన్సెలింగ్ కేంద్రం వద్ద వేచి ఉన్న అభ్యర్థులు, వారి బంధువులు

- ఉదయం మొదలుకాని నూతన ఉపాధ్యాయుల కౌన్సెలింగ్
- మధ్యాహ్నం ప్రారంభించి రాత్రి వరకు నిర్వహణ
- పారదర్శకంగా కౌన్సెలింగ్.. అక్కడికక్కడే పోస్టింగ్ ఉత్తర్వులు

**నేడు విధుల్లో చేరనున్న కొత్త టీచర్లు**

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ–2024లో ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు ఇస్తామని అధికారులు ప్రకటించడంతో ఉదయంకల్లా అంతా ఖమ్మం టేకులపల్లిలోని డైట్ కళాశాలకు చేరుకున్నారు. కానీ కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్లు చెప్పడంతో నిరాశగా వెనుతిరిగినప్పటికీ ఆ వెంటనే మధ్యాహ్నం మళ్లీ అందిన సమాచారంతో చేరుకున్నారు. ఇలా మధ్యాహ్నం మొదలైన ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగింది. కాగా, పోస్టింగ్ ఆర్డర్లు అందుకున్న కొత్త ఉపాధ్యాయులు గురువారం విధుల్లో చేరాల్సి ఉంటుంది.

**ఇప్పుడు కాదు...**

డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 9వ తేదీన నియామక ఉత్తర్వులు అందజేసిన విషయం విదితమే. ఆతర్వాత వారు డీఈఓ కార్యాలయంలో రిపోర్ట్ చేయగా మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు ఇస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో ఉపాధ్యాయులుగా నియమితులైన 520మందిని స్థానిక సంస్థలు, ప్రభుత్వ పాఠశాలల వారీగా విభజించి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు అభ్యర్థులు ఖమ్మం టేకులపల్లిలోని డైట్ కళాశాలకు ఉదయం పది గంటలకల్లా చేరుకున్నారు. కానీ సాంకేతిక కారణాలు, ఉన్నతాధికారుల ఆదేశాలతో కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నామని.. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది సమాచారం ఇస్తామని చెప్పారు. ఈమేరకు ఆశతో వచ్చిన వారు వెనుదిరిగారు. అయితే, కౌన్సెలింగ్ మధ్యాహ్నం ప్రారంభించాలని ఆదేశాలు అందినట్లు ప్రకటించిన డీఈఓ సోమశేఖరశర్మ ఉద్యోగులను అప్రమత్తం చేయడమే కాక అభ్యర్థులకు సమాచారం ఇప్పించారు. దీంతో మధ్యాహ్నం 2గంటల తర్వాత అభ్యర్థులు చేరుకోవడంతో కౌన్సెలింగ్ మొదలుపెట్టారు.

**ర్యాంక్ ఆధారంగా పోస్టింగ్**

జిల్లాలో 520మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కాగా, ఇందులో ఎస్‌జీటీ 292 మంది, ఎస్‌ఏ 228మంది ఉన్నారు. ఇక ఎస్‌జీటీల కోసం మూడు, ఎస్‌ఏల కోసం రెండు బృందాలను ఏర్పాటుచేసి పర్యవేక్షణకు 21మంది ఎంఈఓలను నియమించారు. ఆపై డీఈఓ సోమశేఖరశర్మ నేతృత్వాన డీఎస్సీ ర్యాంక్ ఆధారంగా అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ వారు ఎంచుకున్న స్థానాల్లో అక్కడిక్కడే పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉదయం నుంచి వేచి ఉన్న అభ్యర్థుల ముఖాల్లో కొత్త వెలుగులు నిండగా.. అక్కడకు వచ్చిన బంధువులు, కుటుంబీకులతో సంతోషాన్ని పంచుకున్నారు. కాగా, కౌన్సెలింగ్ కేంద్రం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యాన అభ్యర్థులకు కౌన్సెలింగ్ విధానంపై అవగాహన కల్పించారు.



రెడ్డి మాధురికి పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ



రాత్రి 11గంటలకు కౌన్సెలింగ్ సెంటర్ వద్ద వేచి ఉన్న అభ్యర్థులు

**ప్రశాంతంగా నిర్వహించాం**

ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చాం. కొత్త ఉపాధ్యాయులు బుధవారం ఎంచుకున్న పాఠశాలల్లో చేరాల్సి ఉంటుంది. జిల్లాలో 520మంది విధుల్లో చేరనుండడంతో ఇకపై పాఠశాలల్లో బోధన సాఫీగా సాగుతుంది.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

**ఆనందంగా ఉంది**

ఉపాధ్యాయురాలిగా స్థిరపడాలనేది నా కల. అచ్యుతాపురంలోని పోస్టాఫీస్‌లో ఉద్యోగం చేస్తూనే కుటుంబీకుల ప్రోత్సాహతో కష్టపడి చదివి డీఎస్సీ ఎస్‌జీటీ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించా. ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ పీఎస్‌లో పోస్టింగ్ వచ్చింది.

– రెడ్డి మాధురి, ఎన్నెస్పీ కాలనీ, ఖమ్మం

**గౌరవప్రదమైన వృత్తి అని..**



ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉండడంతో డీఎస్సీకి కష్టపడి సిద్ధమయ్యా. ఈ వృత్తిలో ఉంటే ఎందరినో తీర్చిదిద్దే అవకాశం లభిస్తుంది. డీఎస్సీలో జిల్లా స్థాయి రెండో ర్యాంకు సాధించిన నేను ఇప్పుడు విధుల్లో చేరనుండడం ఆనందంగా అనిపిస్తోంది.

– వలసాల ఉమ, ఎన్నెస్పీ కాలనీ, ఖమ్మం

## ఫీజు బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, గుండాల కృష్ణ, నవీన్‌బాబు తదితరులు

ఖమ్మం సహకారనగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని, తద్వారా డిగ్రీ, పీజీ తదితర సంప్రదాయ కోర్సులను బ్రతికించాలని ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్యాల అసోసియేషన్ ప్రతినిధులు మద్ది ప్రభాకర్‌రెడ్డి, గుండాల కృష్ణ, కాటేపల్లి నవీన్ బాబు, కోటా అప్పిరెడ్డి, వి.మోహన్‌రెడ్డి కోరారు. ఖమ్మంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయాన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. కానీ నాలుగేళ్లుగా కళాశాలలకు నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, తద్వారా కళాశాలల నిర్వహణ కష్టంగా మారిందని చెప్పారు. అప్పులు చేసి, వడ్డీ చెల్లించలేని పరిస్థితిలో ఉన్నందున ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో కళాశాలలు బంద్ కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో కుతుంబాక సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

## ఫీజులు చెల్లించకపోతే చదువు సాగేదెలా?



మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యాసంస్థలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోతే చదువులు ఎలా సాగుతాయో చెప్పాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు చదువును దూరం చేసేందుకే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫలితంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు నిరవధిక బంద్ పాటిస్తుండటంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలకు సకాలంలో బకాయిలు చెల్లించక వారు విద్యకు దూరమయ్యే ప్రమాదం నెలకొందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు మేలు చేసేందుకే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గత ప్రభుత్వం గురుకులాల పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే స్థితికి తీసుకొస్తే, ప్రస్తుత ప్రభుత్వం సమీకృత గురుకులాల పేరుతో గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు లేకుండా చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనే సమీకృత గురుకులాలు ఏర్పాటు చేస్తుండగా, మిగిలిన నియోజకవర్గాల పరిస్థితి ఏమిటని రామకృష్ణ ప్రశ్నించారు. ఇకనైనా ఫీజు బకాయిలు చెల్లించడమే కాక ఖమ్మం కేంద్రంగా జనరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, వసతిగృహ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు ఎస్‌కే నాగుల్‌మీరా, శివనాయక్, వంశీ, మనోజ్, రాకేశ్, ప్రతాప్, గోపి, రోహిత్, సాయి, నరేశ్ పాల్గొన్నారు.

## కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్**



జీఎం షాలెంరాజుతో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్, నాయకులు

సత్తుపల్లిరూరల్/సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తూనే ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యాన ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ తెలిపారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీలోని మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. త్వరలోనే సింగరేణి కార్మికులు, ఉద్యోగులకు ఐటీ మాఫీ, సొంతింటి పథకంపై ప్రభుత్వ పెద్దలతో చర్చిస్తామని తెలిపారు. అలాగే, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచడంపై దృష్టి సారిస్తామన్నారు. ఆ తర్వాత కొత్తగూడెం ఏరియా జీఎం జనరల్ మేనేజర్ శాలేంరాజుతో సమావేశమై వీకే–8 ఓసీ అనుమతులు, పీవీఎన్ కాలనీలో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. ఐఎన్‌టీయూసీ నాయకులు నరసింహారెడ్డి, త్యాగరాజన్, రజాక్, రామారావు, వికాస్ యాదవ్, ఆల్బర్ట్, నాగభూషణం, సీతారామరాజు, గౌస్, రాజేశ్వరరావు, సాగర్, లక్ష్మణ్‌రాజ్, గౌస్, రాజేశ్వరరావు, బోలే అరవింద్, కుమార్, ప్రసాద్, ఉమర్, పీతాంబరం, రావి నాగేశ్వరరావు, క్రాంతికుమార్, భట్టి విక్రమార్క, చెన్నకేశవరావు, ప్రకాష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు పరిశీలన



మిల్లు వద్ద బ్యానర్ ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీలక్ష్మీప్రియ కోటెక్స్ జిన్నింగ్ మిల్లులో ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యాన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఇల్లెందు మార్కెట్ కార్యదర్శి నరేశ్ ఆధ్వర్యాన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పింజ పొడవు రకం ఆధారంగా క్వింటా పత్తికి రూ.7,521 నుంచి రూ.7,121 వరకు ధర నిర్ణయించినట్లు తెలిపారు. సీసీఐ కేంద్రాలకు వచ్చే రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగులు మునీర్ తదితరులు పాల్గొన్నారు.

## వసతిగృహాల్లో వంట పాత్రల సరఫరాకు టెండర్లు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని 11గిరిజన కళాశాల వసతి గృహాలకు వంట పాత్రలు, భోజన ప్లేట్లు, గ్లాస్‌లు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 23వ తేదీలోగా ఖమ్మం కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమశాఖ డీడీ కార్యాలయంలో సీల్డ్ కవర్‌తో టెండర్లు దాఖలు చేయాలని సూచించారు. ఈనెల 24న మధ్యాహ్నం టెండర్లను పరిశీలించి ఖరారు చేస్తామని, వివరాలకు 94406 40070, 94419 08672 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## కొనసాగుతున్న కోటమైసమ్మ జాతర



జాతర ప్రాంగణంలో భక్తుల కోలాహలం

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లిలో కొలువుదీరిన శ్రీకోటమైసమ్మతల్లి ఆలయంలో జరుగుతున్న జాతర మంగళవారం నాలుగో రోజుకు చేరింది. దేవాదాయ ధర్మదాయ శాఖ, పర్సా ట్రస్టు ఆధ్వర్యాన నిర్వహిస్తున్న దసరా పర్వదినం రోజున మొదలైంది. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్, సూర్యాపేట తదితర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. కాగా, జాతర బుధవారం ముగియనుండగా, ఆతర్వాత హుండీ లెక్కింపు చేపడుతామని ఈఓ వేణుగోపాలాచార్యులు తెలిపారు.

## 19, 20వ తేదీల్లో క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి పాఠశాలల క్రీడా జట్ల ఎంపికకు ఈ నెల 19, 20వ తేదీల్లో పోటీలు నిర్వహిస్తామని జిల్లా పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శి కె.నర్సింహమూర్తి తెలిపారు. అండర్–14, 17 బాలబాలకల విభాగాల్లో షూటింగ్, స్క్వాష్, బాస్కెట్‌బాల్, స్కేటింగ్ జట్లతో పాటు అండర్–14 చెస్, అండర్–17 ఖో–ఖో జట్ల ఎంపిక ఉంటుందని వెల్లడించారు. అయితే, అండర్–17 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలకు ఇటీవల జిల్లాస్థాయికి ఎంపికైన వారు మాత్రమే రావాలని సూచించారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుతో సర్దార్ పటేల్ స్టేడియానికి రావాలని వివరించారు.

## తెలంగాణలో అధిక లబ్ధి మాదిగలకే..

**ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుడు చెన్నయ్య**



సమావేశంలో అభివాదం చేస్తున్న చెన్నయ్య, నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ తెలంగాణలో అవసరమేలేదని.. ఇక్కడ అధికంగా లబ్ధి పొందింది మాదిగలేనని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ నాయకుడు చెన్నయ్య తెలిపారు. సమితి ఆధ్వర్యాన చేపట్టిన బస్సు యాత్ర మంగళవారం ఖమ్మం చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ భవన్‌లో గుంతేటి వీరభద్రం అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ మాల వర్గానికి చెందిన మంత్రి లేని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రుల ఉపసంఘాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యుత్సాహం చూపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ ఏర్పడక ముందు 2011 నాటి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పడం సరికాదన్నారు. 2014 తర్వాత జనాభా లెక్కల ఆధారంగా దళితుల స్థితిగతులపై అధ్యయనం చేసి వెనుకబడిన కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పల్లా రాజశేఖర్, లింగాల రవికుమార్, చెరుకు రాంచందర్, కిషన్, బి.వెంకటేశ్వర్లు, హుస్సేన్, రాములు, రవి, నరసింహ, దామల్ల సత్యనారాయణ, బాబురావు, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆయకట్టు అంతటికీ సాగునీరు

సాక్షి ఎఫెక్ట్..



పుణ్యపురం మేజర్ కాల్వలో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

తల్లాడ: అస్తవ్యస్తంగా ఉన్న నాగార్జునసాగర్ కాల్వలతో చివరి ఆయకట్టుకు నీరు అందని విషయమై ఈనెల 11న 'సాక్షి'లో 'చివరికి నీరేది?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన జలవనరుల శాఖ డీఈఈ వి.శ్రీనివాసరావు, ఏఈ శ్రీనివాసరెడ్డి పుణ్యపురం, సిరిపురం, బస్వాపురం మేజర్లు,, వాటి పరిధిలోని మైనర్ కాల్వలను నాలుగు రోజులుగా పరిశీలించారు. ఈమేరకు ఎన్నెస్పీ సిబ్బందితో కాల్వలకు అడ్డుగా ఉన్న చెత్తాచెదారం, గడ్డి మొక్కలను తీయించారు. దీంతో మంగళవారం నుంచి నీరు సాఫీగా సాగుతుండడంతో చివరి ఆయకట్టుకు కూడా అందుతోంది. ఈమేరకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఈత కొడుతుండగా ఫిట్స్.. విద్యార్థి మృతి

నేలకొండపల్లి: సరదాగా ఈత నేర్చుకునేందుకు వెళ్లిన విద్యార్థిని చెరువు అలుగు మింగింది. నేలకొండపల్లి మండలంలోని మంగాపురతండాకు చెందిన ధనావత్ గోపి(19) మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నారు. ఆయన మంగళవారం స్నేహితులతో కలిసి చెరువుమాధారం చెరువు అలుగు వద్దకు వెళ్లి ఈత కొడుతుండగా ఫిట్స్ వచ్చాయి. దీంతో అలుగులో మునిగిన ఆయన కోసం స్నేహితులు గాలించినా ఆచూకీ లభించలేదు. చివరకు కాస్త దూరంలో మృతదేహం లభించింది. ఈ విషయం తెలిసి చేరుకున్న కుటుంబ సభ్యులు గోపి మృతదేహంపై పడి కన్నీరుమున్నీరుగా రోదించారు. కాగా, పదేళ్ల క్రితం ఆయన సోదరుడు ఇంటి వద్ద గాబులో పడి మృతి చెందాడు.

## గడ్డి మందు తాగిన వ్యక్తి..

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెంకు చెందిన కొణతాల వీరబాబు(43) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... ఆటోడ్రైవర్‌గా పనిచేసే ఆయన కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై కుటుంబీకులు మందలించినా వినకపోగా ఈనెల 14న ఆయన భార్య నాగమణి కూలీ పనులకు వెళ్లాక పిల్లలతో గొడవ పడ్డాడు. ఆతర్వాత బయటకు వెళ్లిన వీరబాబు సాగర్ కాల్వ సమీపాన గడ్డిమందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వారు వెళ్లి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఘటనపై వీరబాబు భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్కన్ రాజు తెలిపారు.

## గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

కల్లూరు: కల్లూరులోని పుల్లపుకుంటలో మంగళవారం గుర్తుతెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. ఈ సమాచారం మేరకు కల్లూరు ఏసీపీ రఘు, సీఐ లింగయ్య, ఎస్ఐ షాకీర్ చేరుకుని పరిశీలించారు. సుమారు 20 రోజుల క్రితం మృతి చెందినట్లు తెలుస్తుండగా మృతదేహం పాడైపోయింది. పెనుబల్లి వైద్యులను పిలిపించి అక్కడే పోస్టుమార్టం చేయించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

సత్తుపల్లిటౌన్: పామాయిల్ గెలల లోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. సత్తుపల్లిలోని సింగరేణి బైపాస్‌రోడ్‌లో మంగళవారం పెనుబల్లి వైపు నుంచి సత్తుపల్లి వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుకాల వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ట్రాక్టర్ ట్రక్ బోల్తా పడి రహదారిపై ఆయిల్‌పామ్ గెలలు పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అలాగే, బస్సు అద్దాలు పగిలి ఓ మహిళకు గాయాలయ్యాయి. పోలీసులు చేరుకుని ట్రాక్టర్‌ను తీయించి రాకపోకలు క్రమబద్ధీకరించారు.

## షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

కామేపల్లి: ఏజెన్సీ ప్రాంత రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ఇల్లెందు నియోజకవర్గంలోని పీఏసీఎస్ సొసైటీల చైర్మన్లు కోరారు. ఈసందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మంగళవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గతంలో రైతులకు మ్యానువల్ పహాణీ నకళ్లపై రుణాలు అందించారని, ఏజెన్సీలో గిరిజనేతరులకు పట్టా పాసు పుస్తకాలు మంజూరు కాకపోవడంతో రుణమాఫీ వర్తించక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ మేరకు పోడు భూములు సాగుచేసుకుంటున్న సైతం రైతులకు సైతం రుణమాఫీ వర్తింపజేయాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కొండాయిగూడెం, కామేపల్లి, టేకుపల్లి, బయ్యారం పీఏసీఎస్‌ల చైర్మన్లు ధనియాకుల హన్మంతరావు, పుచ్చకాయల వీరభద్రం, లక్కినేని సురేందర్, మూల మధుకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## బాలికపై ఇద్దరు మైనర్ల అత్యాచారయత్నం

బోనకల్: బోనకల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏడో తరగతి విద్యార్థినిపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్లు అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాలిక తల్లిదండ్రులు సోమవారం కూలీ పనికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉంది. ఈ విషయాన్ని గమనించిన ఇద్దరు బాలురు వచ్చారు. ఒకరు ఇంట్లోకి వెళ్లి బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడుతుండగా మరో బాలుడు తలుపులు వేసి బయట నిల్చున్నాడు. దీంతో బాలిక కేకలు వేస్తుండగా ఇద్దరూ పరారయ్యారు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక విషయాన్ని చెప్పడంతో వారు మంగళవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, బాలురపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుబాబు తెలిపారు.